

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి   గురువారం 25-08-2022   సంపుటి : 04   సంచిక : 08   పేజీలు : 4   వెల : రూ 3-00


## చిత్తూరు టీడీపీలో విషాదం.. చంద్రబాబుగ్ర్భాంతి

బాపట్ల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం తిరుపతి జిల్లా టీడీపీలో తీవ్ర విషాదం నింపింది. ఈ ప్రమాదంలో టీడీపీ చెందిన ఇద్దరు నేతలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను భానుప్రకాష్ రెడ్డి, గంగపల్లి భాస్కర్‌గా గుర్తించారు. మరో నేత సోమశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు.బాపట్ల జిల్లా పరిధిలోని జే పంగలూరు మండలం కొండ మంజులూరు వద్ద ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తెలుగు యువత అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి గంగపల్లి భాస్కర్ ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. అదే కారులో ప్రయాణిస్తున్న ఐటీడీపీ నియోజకవర్గం ఇంఛార్జ్ సోమశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరులో ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో బయల్దేరి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఇద్దరు నేతల మృతదేహాలను ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు.ఈ ప్రమాద వార్త తెలియగానే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రగ్ర్భాంతికి గురిచేసిందని, గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న సోమశేఖర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ఇంఛార్జ్ పులివర్తి నాని కూడా వీరి మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి ఆత్మ శాంతించాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# మంచిపనులు చేస్తే కలకాలం గుర్తుంచుకుంటారు

### వైఎస్ అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో నిలిచారు
### ఆయన అడుగు జాడల్లో నాలుగు అడుగులు వేస్తున్నా
### చీమకుర్తిలో వైఎస్సార్,బూచేపల్లిల విగ్రహావిష్కరణలో జగన్



ఒంగోలు,అగస్టు24): మంచి చేస్తే మనిషికి మరణం ఉండదని, ప్రతీ గుండెలోనూ సజీవంగా నిలిచే ఉంటారనడానికి నిదర్శనం ఇవాళ జరిగిన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమమే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తిలో మహానేత వైఎస్సార్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి కాంస్య విగ్రహాల ఆవిష్కరణ అనంతరం.. బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పేదల సంక్షేమం అంటే ముందుగా గుర్తొచ్చే పేరు వైఎస్సార్. రైతుల సంక్షేమం, ఉచిత విద్యుత్, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యం.. ఇలా ఎంతో మంచి చేశారాయన. ఆయన ఒక అడుగు వేస్తే.. వైఎస్సార్ బిడ్డగా తాను నాలుగు అడుగులు ముందుకు వేస్తానని సీఎం జగన్ మరోసారి వేదిక సాక్షిగా ప్రకటించారు. ఇచ్చినమాట ప్రకారం.. 95 శాతం మేనిఫెస్టో హామీలను ఇప్పటికే నెరవేర్చామని, దేవుడి దయ.. ప్రజల ఆశీస్సులతో మరింత మంచి చేస్తామని సీఎం జగన్ తెలిపారు. మహానేతతో పాటు ఆయనతో అడుగులు వేసిన నేత బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహం కూడా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్న సీఎం జగన్.. వచ్చే ఏప్రిల్ 14న విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఉంటుందని ప్రకటించారు. గాంధీ, అంబేద్కర్, పూలే, అల్లూరి, ప్రకాశం, మహానేత వైఎస్సార్.. ఇలా మహనీయులను కలకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. ఎందుకంటే వీళ్లకు భౌతికంగా మరణం ఉన్నా.. వీళ్లు చేసిన మంచికి, భావాలకు మరణం ఉండదు



అనేది వాస్తవమని సీఎం జగన్ తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారం.. చిన్నచిన్న పరిశ్రమలకు మేలు జరిగేలా నిర్ణయాలు అమలు చేయబోతున్నామని సీఎం జగన్ చీమకుర్తి సభా వేదికగా ప్రకటించారు. చిన్న గ్రానైట్ పరిశ్రమలకు కరెంట్ ఛార్జీల్లో రూ.2 తగ్గింపు ఉంటుందన్న సీఎం జగన్ ప్రకటించారు. గ్రానైట్ పరిశ్రమకు కొత్త స్లాబ్ సిస్టమ్ తీసుకురాబోతున్నట్లు తెలిపారాయన. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరినట్లు.. ఒంగోలులో శిథిలావస్థలో ఉన్న కొత్త జిల్లా పరిషత్ కార్యాలయం కోసం రూ. 20 కోట్ల మంజూరు చేయడంతో పాటు తుళ్లూరు మండలంలోని శివరాంపురంలో ఉన్న మొగిలిగుండ్ల చెరువును మినీ రిజర్వాయర్ పేరును బూచేపల్లి సుబ్బారెడ్డి రిజర్వాయర్‌గా మారుస్తున్నట్లు ఆదేశాలు జారీ చేస్తున్నామని సీఎం జగన్ ప్రకటించారు. ఇదిలావుంటే చీమకుర్తి సభలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ పాట సభలో నవ్వులు కురిపించింది. వద్దని జగన్ వారించినా వినకపోవడంతో ఆయనే స్వయంగా వెళ్లి వెంకాయమ్మను బలవంతంగా తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు. వైఎస్సార్ ఆశయాలను చిత్తశుద్ధితో ముందుకు తీసుకెళ్తున్నానని, మ్యానిఫెస్టోలో తెలిపిన 95 శాతం హామీలు నెరవేర్చామని, దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం ఉంటే మరింత మేలు చేస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 14న విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం జగన్ తెలిపారు. గాంధీ, అంబేద్కర్, పూలే, అల్లూరి, ప్రకాశం, వైఎస్సార్ వంటి మహానాయకులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, వారి మంచిపనులకు, భావాలకు మరణం లేదని జగన్ అభిప్రాయపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టు 1,2 టన్నెలు పనులు వైఎస్ ప్రారంభించగా.. టీడీపీ హయాంలో నిలిచిపోయాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులను తాము అధికారంలోకి రాగానే ప్రారంభించామని, 2023 సెప్టెంబర్ కల్లా పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. కొత్త జడ్పీ కార్యాలయం భవనం నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మొగిలిగుండాల ప్రాజెక్టుకు బూచేపల్లి సుబ్బారెడ్డి మొగిలిగుండాల ప్రాజెక్టుగా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు.

## అమిత్ షా, జూనియర్ ఎన్టీఆర్ భేటీపై క్లారిటీ ఇచ్చిన జీవీఎల్

విశాఖపట్నం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి ఈ మధ్య హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో లంచ్ చేశారు. అమిత్ షా బిజీ షెడ్యూల్ మధ్య జూనియర్ ఎన్టీఆర్‌తో భేటీ కావడంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అయితే ఈ భేటీపై తాజాగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్పందించారు. వారిద్దరి మధ్య జరిగిన భేటీలో కేవలం సినిమా అంశాలు మాత్రమే ప్రస్తావనకు వచ్చాయని తాను భావించడం లేదన్నారు. రాజకీయ అంశాలు కూడా వారి మధ్య ప్రస్తావనకు వచ్చే ఉంటాయన్నారు. వాస్తవంగా వారిద్దరి మధ్య ఏం జరిగింది అనేది వారివురిలో ఎవరో ఒకరు బయటకు చెప్తేనే తెలుస్తుందని జీవీఎల్ అన్నారు.



## సామాజిక సంస్థల ద్వారా వైద్య సేవలు భేష్

### మాతా అమృతానందమయి హాస్పిటల్ ప్రారంభంలో మోడీ



చండీఘడ్,అగస్టు24: ఆధ్యాత్మిక, సామాజిక సంస్థల ద్వారా వైద్య సేవలు అందించడమనేది.... పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ మోడల్ కు ఉదాహరణ అని ప్రధాని మోడీ అన్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో అమృత హాస్పిటల్‌ను ప్రధాని మోడీ ప్రారంభించారు. కార్యక్రమంలో హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌటాలా పాల్గొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయలతో 6 వేల కోట్లతో మాతా అమృతానందమయి మఠం ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్మించారు. ఈ మోడల్ ద్వారా అట్టడుగు వర్గాల వారికి కూడా సేవలు అందించవచ్చారు. దేశంలో ప్రస్తుతం విద్య, వైద్య వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు ప్రధాని మోడీ. పెద్ద రోగం వస్తే ట్రీట్ మెంట్ కోసం పేషెంట్స్ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సి వస్తుండేదని.. ఇప్పుడు ఆ అవసరం లేదని ప్రధాని మోడీ తెలిపారు. ఈ హాస్పిటల్‌కు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పేషెంట్లు వచ్చి చికిత్స పొందవచ్చు అని చెప్పారు.




## కడప జిల్లా పర్యటనకు సీఎం జగన్



వేంపల్లె (వైఎస్సార్ కడప): సెప్టెంబర్ 1, 2 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయకు రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్, గెస్ట్ హౌస్, నెమళ్ల పార్కు తదితర ప్రాంతాలను ఆయన జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన మేరకే అధికారులను, ప్రజాప్రతినిధులను అనుమతించాలన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. ఇంకా అధికారికంగా ముఖ్యమంత్రి షెడ్యూల్ వివరాలు రావాల్సి ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండకుండా చురుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యు?యఎస్ ఈఈ సిద్ధారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సర్కార్‌కు హైకోర్టు మొట్టికాయ.. శ్రీకాంత్ నియామకంపై స్టే



అమరావతి: ఏపీ సర్కార్‌కు అక్కడి హైకోర్టు మరోసారి మొట్టికాయ వేసింది. ఈ సారి ఓ సలహాదారు నియామకం గురించి మొట్టికాయ వేయడం విశేషం. అంతటితో ఆగకుండా ఆయన నియామకంపై స్టే కూడా విధించింది. శ్రీకాంత్ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు.. ఈ సందర్భంగా ఏపీ సర్కార్‌పై కీలక వ్యాఖ్యలు కూడా చేసినట్లుగా తెలుస్తున్నది.ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ సలహాదారుగా జ్వాలాపురం శ్రీకాంత్ నియామకంపై ఏపీ హైకోర్టు స్టే విధించింది. శ్రీకాంత్‌ను సలహాదారుగా నియమించడం పట్ల దాఖలైన పలు పిటిషన్లపై ఏపీ హైకోర్టు విచారించి ఈ మేరకు స్టే అమలుచేసింది. శ్రీకాంత్ నియామకంపై ఘాటుగా స్పందించిన హైకోర్టు.. దీన్ని ఇలాగే వదిలేస్తే రేపు అడ్వకేట్ జనరల్‌కు కూడా సలహాదారును నియమిస్తారు అంటూ వ్యాఖ్యానించడం కలకలం రేపింది. సలహాదారులను నియమించేందుకు అవసరమేంటి అని కూడా ప్రశ్నించినట్లు తెలుస్తున్నది. ఇదే సమయంలో మంత్రులకు సలహాదారులు ఉన్నరంటే ఓకే కానీ, ప్రభుత్వ శాఖలకు సలహాదారులేంటి? అని ప్రశ్నించినట్లు సమాచారం. వెంటనే శ్రీకాంత్ సలహాదా రుగా నియమించడంపై స్టే విధిస్తున్నట్లు హైకోర్టు పేర్కొన్నది .అనంతపురం జిల్లాకు చెందిన జ్వాలాపురం శ్రీకాంత్‌ను దేవాదా య శాఖ సలహాదా రుగా ప్రభుత్వం నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాంత్ ఏపీ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో టీడీపీలో కొనసాగిన శ్రీకాంత్.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఓ స్వామిజి సూచనల మేరకు శ్రీకాంత్‌కు సలహాదారు పదవి వరించినట్లుఅనం తపురంజిల్లాలో దేవాదాయ శాఖలో సలహాదారు పదవి అనేది లేనప్పటికీ.. ప్రభుత్వం ఈయన కోసమే సృష్టించి మరీ నియమిం చినట్లుగా రాష్ట్రానికి చెందిన రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

## దశాబ్దాల తర్వాత.. కాంగ్రెస్ అధ్యక్ష పీఠంపై గాంధీయేతర వ్యక్తి..!

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోనున్నది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా గాంధీయేతర కుటుంబానికి చెందిన వ్యక్తిని పార్టీ అధ్యపీఠంపై కూర్చోబెట్టనున్నది. పార్టీ పగ్గాలు చేపట్టేందుకు రాహుల్ గాంధీ మొగ్గు చూపడం లేదు. మరో వైపు ప్రియాంక గాంధీ సైతం అధ్యక్ష రేసులో ఉన్నా.. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం నేపథ్యంలో ఆమెకు బాధ్యతలు అప్పగించేందుకు సంసిద్ధంగా లేనట్లు తెలుస్తున్నది. తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ.. తమ కుటుంబానికి విధేయుడైన రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు అధ్యక్ష పదవి కట్టబెట్టనున్నట్లు తెలుస్తున్నది.అయితే అశోక్ గెహ్లాట్ మాత్రం రాహుల్ గాంధే అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే సెప్టెంబర్ 21 నాటికి పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకం జరుగనున్నది. ఈ క్రమంలో పార్టీ వివరణాత్మక ప్రకటన చేయనున్నది. మరో వైపు సోనియా మంగళవారం రాజస్థాన్ సీఎం గెహ్లాట్‌ను ఆయన నివాసంలో కలిసినట్లు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ పగ్గాలు చేపట్టాలని గెహ్లాట్‌ను కోరినట్లు తెలుస్తున్నది. అనారోగ్య కారణాలతో పార్టీ బాధ్యతలు నిర్వహించలేనని సోనియా గాంధీ గెహ్లాట్‌తో చెప్పినట్లు తెలియవచ్చింది. సోనియా గాంధీని కలిసిన తర్వాత గెహ్లాట్ ఢిల్లీ విమానాశ్రయంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ అధ్యక్షుడైన తర్వాతే పార్టీని పునర్నిర్మించగలమని తాను పదేపదే చెబుతున్నానన్నారు.ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించకుంటే నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురవుతారన్నారు. పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని నిరంతరం ఒత్తిడి తెస్తామన్నారు. మరో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు ససేమిరా అంటే.. ఎవరూ బలవంతం చేయలేరని అన్నారు. మరో వైపు గెహ్లాట్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో పాటు సచిన్ పైలట్‌ను సీఎంగా వచ్చే రాజస్థాన్ ఎన్నికల బరిలోకి దింపనున్నది. ఇటు విధేయుడికి పార్టీలో కీలక పదవిని కట్టబెట్టడంతో పాటు రాజస్థాన్ నేతల్లో ఉన్న అసంతృప్తి నేతలకు ఉపశమనం కలిగించేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



# సంపాదకీయం

గురువారం 25-08-2022

## ఇప్పుడు తైవాన్ పై చైనా కన్ను

ఉద్రిక్తతల నడుమ తైవాన్‌కు యూఎస్ అసెంబ్లీ ప్రతినిధులసభ స్పీకర్ నాన్సీ పెలోసీని పంపించటంతో చైనా?తైవాన్‌ల మధ్య భవిష్యత్తులో యుద్ధం జరిగే అవకాశాలను తెరపైకి అమెరికా తీసుకొ చ్చింది. ఇక యుద్ధ బూచితో ఆసియా పసిఫిక్ దేశాలకు 'నాటో' సభ్యత్వాన్ని ప్రోత్స హిస్తూ, మ్యాడ్రిడ్ నిర్ణయాల ప్రకారం నాటోను ఈ ప్రాంతానికి విస్తరించే ప్రయత్నంలో అమెరికా ఉంది. ఇప్పటికే మన భారతదేశానికి 'నాటో ప్లస్' సభ్యత్వం ఇవ్వటానికి 6వ దేశంగా అర్హత కోసం యూఎస్ అసెంబ్లీలో నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డిఏఏ)కు సవరణలు చేశారు. ఈ తరహా అర్హతలు ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్, ఇజ్రాయిల్, దక్షిణ కొరియాలు కలిగి ఉన్నాయి. బిల్లు ఆమోదం పొందితే నాటో దేశాలతో సఖ్యతగా మెలిగే అవకాశాలను మనదేశానికి కల్పించి, భవిష్యత్తులో నాటో చేసే యుద్ధాలకు మనల్ని బలి పశువులను చేసే అవకాశం ఉంది. పెలోసీ పర్యటనను మానుకోమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హితవు పలికినప్పటికీ... యూఎస్ మిలటరీ, ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు పెడచెవినపెట్టి, పర్యటనను ప్రణాళిక ప్రకారం సాగించారు. నాన్సీ పెలోసీని తైవాన్‌కు పంపాలను కోవటం నిప్పుతో చెలగాటం వంటిదనీ, ఆ నిప్పులో ఆహుతిగాక తప్పదనీ చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తీవ్ర స్వరంతో టెలిఫోన్‌లో బైడెన్‌ను హెచ్చరించాడు. ఈ హెచ్చరికతో తాత్కాలికంగా పెలోసీ పర్యటన దేశాల లిస్టులో కేవలం సింగపూర్, మలేసియా, జపాన్, దక్షిణ కొరియా దేశాల పేర్లు మాత్రమే ప్రకటించారు. తైవాన్ చైనాలో అంతర్భాగం గనుక మమ్మల్ని రెచ్చగొట్టటానికి ప్రయత్నిస్తే తైవాన్‌లో అడుగుపెట్టే ముందే పెలోసీ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేస్తామనీ, లేకుంటే చైనా ఆర్మీ విమానాలు తైవాన్‌లో దిగుతాయనీ మిలిటరీ శాఖ తీవ్రంగా హెచ్చరించింది. పెలోసీకి రక్షణగా అమెరికన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ 'రొనాల్ట్ రీగన్', దాని అనుబంధ గ్రూపు యుద్ధ విమానాలు, నౌకలు, జలాంతర్గాములు, గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్, క్రూయిజ్‌తో సహా రెండు రోజుల క్రితమే సింగపూర్ నుండి తైవాన్ వైపు దక్షిణ చైనా సముద్ర జలాల్లోకి వచ్చాయి. చైనా నేవీ, ఎయిర్‌ఫోర్స్ కలిసి తైవాన్ జలసంధిలో మిలిటరీ విన్యాసాలు చేస్తున్న ఉత్కంఠ పరిణామాల మధ్య పెలోసీ ఆగస్టు 2 రాత్రి తైవాన్ విమానా శ్రయంలో దిగారు. ఇందుకు నిరసనగా ఆ తర్వాత తైవాన్ చుట్టుప్రక్కల ఉన్న సముద్రంలోని లక్ష్యాలపై క్షిపణుల వర్షం కురిపించి, తైవాన్ వాసులను చైనా భయకంపితులను చేసింది. ఈ దృశ్యాలను తైవాన్ మీడియా ప్రసారం చేసింది. అదేమంటే దీనికి పూర్తి బాధ్యత అమెరికాదేనని చైనా ఆరోపిస్తోంది. షియాంగ్ కై షేక్ పాలనలోని చైనాపై 1949లో మావో నాయకత్వాన విప్లవం విజయం సాధించగా, అమెరికా అండతో తైవాన్‌కు పారిపోయిన షియాంగ్ అక్కడ నుండి చైనాను పాలించడానికి ప్రయత్నించాడు. 1971 వరకు తైవాన్ కేంద్రమయిన 'రిపబ్లిక్ ఆఫ్ చైనా'ను మాత్రమే ఐక్య రాజ్యసమితి గుర్తించింది. 1971 నుండి 'ఒకే చైనా' దేశంగా మెయిన్ ల్యాండ్ చైనాను తైవాన్‌తో సహా 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' (పీఆర్‌సీ)గా ఐరాస గుర్తించింది. ఈ ఒకే చైనాతో 1979 నుండి జిమ్మీ కార్టర్ ప్రభుత్వం దౌత్య సంబంధాలను ఏర్పర్చు కొంది. పీఆర్‌సీ అసలైన చైనా దేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందటంతో, ఎప్పటి వలెనే తైవాన్ చైనాలో అంతర్భాగంగా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా కనీసం డజను దేశాలు కూడా తైవాన్‌తో దౌత్య సంబంధాలను ఏర్పర్చుకోలేదు. మనదేశం కూడా దౌత్య సంబంధాలు ఏర్పర్చుకోలేదు. చైనా, తైవాన్‌ల మధ్య తరచూ అమెరికా కలహాలు సృష్టిస్తూ ఆయుధాల్ని అమ్ముతూ, మూడవ సంస్థలు, వ్యక్తులు, కంపెనీల ద్వారా వర్తక వాణిజ్యాలు చేస్తూ పరోక్ష సంబంధాలతో చైనాను కవ్విస్తూనే ఉంది. స్వదేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న అమెరికాలో బైడెన్ ప్రభుత్వాన్ని గద్దె దింపటానికీ, రానున్న మధ్యంతర ఎన్నికల్లో రిబ్లికన్లను నెగ్గించటానికీ ఉక్రెయిన్, తైవాన్ యుద్ధాలను ప్రోత్సహించ టానికై విపక్షాలు, మిలటరీ పరిశ్రమలు తీవ్రంగా కృషి సల్పుతున్నాయి. యుద్ధ వాతావరణాన్ని తక్షణమే ఆపి, చైనాలో అంతర్భాగంగా తైవాన్‌ను గుర్తించి, చైనా?తైవాన్‌ల అంతర్గత వ్యవహారంగా ఒకే చైనా సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి. ఇప్పటికే అమెరికా ఏకధ్రువ ప్రపంచానికి కాలం చెల్లిందని అఫ్ఘనిస్తాన్, మధ్యప్రాచ్య యుద్ధాల చరిత్ర స్పష్టం చేసింది. ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధం ఆ సంగతిని గట్టిగా ధ్రువీకరి ంచింది. రానున్న కాలం బహుళ ధ్రువ ప్రపంచానిదే. చైనా? తైవాన్, చైనా?హాంగ్‌కాంగ్, చైనా?మకావ్ వంటి సమస్యలు చైనా అంతరంగిక విషయాలుగా పరిగణించి, విదేశీ శక్తుల జోక్యం లేకపోవటం శ్రేయస్కరం.

# కేతిరెడ్డి టార్గెట్...

అనంతపురం, ఆగస్టు 24, జీపు మీద జీన్స్ టీ షర్ట్‌తో.. కూలింగ్ గ్లాసులు పెట్టుకుని.. నాలుగు గుర్రాలను పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్న ఈయన ఎవరో కాదు.. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి. ఈ ఫొటోను చూపిస్తూ తిరుపతి సభలో జనసేనాని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దాంతో కేతిరెడ్డిని ఎందుకు జనసేనాని టార్గెట్ చేశారనే చర్చ జరుగుతోంది. ఫొటో వెనక కథ గురించి ఆసక్తిగా ఆరా తీస్తున్నారు కొందరు. ఇది చాలా పాత మ్యాటర్.. ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తూ.. స్థానికంగా ఉన్న కొందరు విడుదలు చేసి ఫొటోలు ఇవి. ధర్మవరం చెరువుకు ఆనుకుని ఉన్న.. ఒక కొండ వద్ద ఎమ్మెల్యే భారీ ఫామ్ హౌస్ నిర్మించుకున్నారని.. ఆ స్థలాలను దళిత రైతుల నుంచి లాక్కున్నారని గతంలో కొందరు ఆరోపించారు. అక్కడే ఇంద్ర భవనాన్ని నిర్మించారనేది ఆరోపణ. కోట్లు విలువ చేసే కార్లు, గుర్రాలు, బోటింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారని.. ఇన్ని షోకులకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరోపణలకు కేతిరెడ్డి గతంలో చాలాసార్లు వివరణ ఇచ్చారు. డాక్యుమెంట్లూ చూపించారు. అయినప్పటికీ వివాదాం అడపాదడపా రగులుతూనే ఉంది. కరోనా సమయంలో హార్స్ రైడింగ్ నేర్చుకునేందుకు గుర్రాలు తెప్పించుకున్నానని.. ఆ తరువాత తిరిగి ఇచ్చేశానన్నారు కేతిరెడ్డి. అలాగే బోటింగ్ ఒక్కటే ఉందని.. అది లక్షలు.. కోట్లు అని ప్రచారం చేయడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఈ అంశాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ టేకప్ చేశారు. ధర్మవరానికి చెందిన జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి పార్టీలో యాక్టివ్. సేవ్ ధర్మవరం పేరుతో నియోజకవర్గంలో పర్యటించారు. జనసేన ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధుసూదన్ రెడ్డి రాయలసీమలో చేపట్టే కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఆయనే కేతిరెడ్డి గురించి

పవన్ కల్యాణ్‌కు చెప్పినట్టు తెలుస్తోంది. కేతిరెడ్డి ఫొటో చూపిస్తూ.. వైసీపీ ఎమ్మెల్యేలు.. దళిత గిరిజన భూములు కాజేసి.. ఇలా రాజసం అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు పవన్ కల్యాణ్. దీంతో రాష్ట్రంలో అందరి దృష్టి ఆ ఫొటో పై పడింది. ఒక ఎమ్మెల్యే గురించి ఫొటో పట్టుకుని మాట్లాడటం చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశంపై కేతిరెడ్డి గతంలో ఇచ్చిన వివరణ పవన్ కల్యాణ్ గమనించారో లేదో అనే చర్చ నడుస్తోంది. ఒకవేళ ఆ వివరణ చూసి ఉన్నా.. విశ్వసించలేదోమో అని అనుకుంటున్నారట. ఇప్పుడు జనసేనానే కొత్తగా సమస్యను తిరగదోడటంతో కేతిరెడ్డి స్పందన ఏంటనేది ఆసక్తి నెలకొంది. మొత్తానికి ఒక ఫొటో.. పాత అంశాన్ని సరికొత్తగా చర్చల్లోకి తీసుకొచ్చింది.

# జంపింగ్‌ల తలపోట్లు

గుంటూరు, ఆగస్టు 24, ఎమ్మెల్యేలు గ్రాఫ్ పెంచుకోవాలి. జనాల్లో ఉండాలి. పనితీరు మెరుగు పర్చుకోకపోతే ఉపేక్షించేది లేదు అని ఆ మధ్య వైసీపీ ఎమ్మెల్యేలతో సూటిగా సుత్తిలేకుండా చెప్పేశారు సీఎం జగన్. వివిధ మార్గాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా మొత్తం వైసీపీ ఎమ్మెల్యేల జాతకాలన్నీ అధినేత దగ్గర ఉన్నాయి. వాటి ఆధారంగానే హెచ్చరికలు చేశారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటింది. వచ్చే ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఇన్నాళ్లూ సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టిన సీఎం జగన్.. రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారం చేపట్టే దిశగా రాజకీయంగా పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యేలు మారాలని చెప్పారు. అది వినని ఎమ్మెల్యేలనే మార్చే పనిలో పడ్డారు వైసీపీ అధినేత. ఇప్పుడున్న ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? ప్రజల్లో వారికి లభిస్తున్న ఆదరణ..! ఇలా కొన్ని కొలమానాలను నిర్దేశించుకుని ప్రక్షాళన మొదలుపెట్టారు. దానికి తాడికొండ నుంచి శ్రీకారం చుట్టడంతో అధికారపార్టీలో అలజడి మొదలైంది. నెక్ట్స్ ఎవరు.. ఏ నియోజకవర్గం అనే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో పెరుగుతోంది. తాడికొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని పక్కన పెట్టి.. అక్కడ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను వైసీపీ అదనపు సమన్వయకర్తగా నియమించింది. ఆ నిర్ణయం వెలువడగానే ఎమ్మెల్యే శ్రీదేవితోపాటు ఆమె అనుచరులు భగ్గుమన్నారు. రోడ్డెక్కి చేయాల్సిన రచ్చంతా చేశారు. కానీ.. వైసీపీ అధిష్ఠానం ఎమ్మెల్యే శ్రీదేవి అండ్ కో చేపట్టిన ఆందోళనలను లైట్ తీసుకున్నట్టుగా సమాచారం. మూడేళ్లుగా తాడికొండలో జరిగిన పరిణామాలు.. శ్రీదేవి చుట్టూ ముసిరిన వివాదాలు పరిశీలించిన తర్వాత డొక్కాను తెరపైకి తీసుకొచ్చింది. ఇదే విధంగా రాష్ట్రంలోని కొన్ని నియోకజకవర్గాల్లో కఠిన నిర్ణయాలు ఉంటాయని సమాచారం. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. వైసీపీ పెద్దల దగ్గర ప్రక్షాళన చేపట్టాల్సిన జాబితాలో 40 నియోజకవర్గాలు ఉన్నాయట. వాటిలో తొలి విడతగా 16 చోట్ల చర్యలు తీసుకుంటారని తెలుస్తోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల వ్యవహారాలు.. ప్రజల్లో వారికి ఉన్న ఆదరణ.. వివాదాలు.. నెగ్గుతారా లేదా అనే అంశాల ఆధారంగా సిట్టింగ్ శాసనసభ్యులపై నిర్ణయాలు తీసుకుంటున్నారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే నెగ్గలేరు అని భావిస్తే.. అక్కడ సమర్థులైన మరో వైసీపీ నేతకు పగ్గాలు అప్పగిస్తారని చెబుతున్నారు. తాడికొండలో డొక్కాను తెరపైకి తెచ్చిన విషయాన్ని ఉదహరిస్తున్నాయి పార్టీ వర్గాలు. ఎమ్మెల్యేలను రెండేళ్ల ముందే పక్కన పెట్టేలా చర్యలు ఉండటంతో ప్రాధాన్యం నెలకొంది. కొంత మంది ఎమ్మెల్యేలు పనితీరు బాగోక పోయినా.. వారికి ఫాలోయింగ్..

ఇతర సమీకరణాలు ముడి పడి ఉంటే ప్లేస్ మార్చొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఎన్నికలకు రెండేళ్లముందే రిపేర్లు చేపట్టడం వెనక పెద్ద వ్యూహమే ఉందట. ఎన్నికల సమయంలో సిట్టింగ్‌లను కాదని వేరొకరికి టికెట్స్ ఇస్తే రాజకీయంగా లేని పోని చికాకులు.. గొడవలు వస్తాయి. అదే ముందే క్లారిటీ ఇచ్చేస్తే మంచిదనే లెక్కల్లో ఉన్నారట అధికారపార్టీ నేతలు. చివరి నిమిషంలో జంపింగ్‌ల తలపోట్లు లేకుండా ఉంటాయని భావిస్తున్నారట. ఎమ్మెల్యేలను ఇప్పుడే పక్కన పెట్టేస్తే అక్కడ ప్రజలకు స్పష్టత వస్తుంది.. పార్టీ బలోపేతానికి ప్రత్యేక ఫోకస్ పెట్టొచ్చనే చర్చ నడుస్తోందట. ఇంత వరకు బాగానే ఉన్నా.. వైసీపీ అధిష్ఠానం దగ్గరున్న జాబితాలోని 40 మంది ఎవరు అనేదే ఉత్కంఠ రేపుతోంది. అందులోనూ తొలి జాబితాలో 16 అని తెలియడంతో.. తాడికొండ తర్వాత ఎవరు ఏంటీ అనే ఆసక్తి పెరిగిపోతోంది. మొత్తానికి వైసీపీ ఎమ్మెల్యేలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చేందుకు అధిష్ఠానం కఠిన వైఖరే తీసుకున్నట్టు అర్థం అవుతోంది. దీంతో ఇన్నాళ్లూ సీఎం మాటలను లైట్ తీసుకున్నవాళ్లూ .. గ్రాఫ్ బోర్డర్‌లో ఉన్నవాళ్లూ సెట్ అవుతారని అనుకుంటున్నారు. మరి.. ఈ వైసీపీ జాబితాలో ఉన్నవాళ్లు ఎవరో కాలమే చెప్పాలి.

# తెరపైకి లేపాక్షి భూములు వ్యవహారం

విజయవాడ, ఆగస్టు 24, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తండి వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడే భారీ అవినీతి కేసుల్లో ఇరుక్కున్న జగన్ సీఎం అయిన తరువాత మరింత రెచ్చిపోయారనడానికి ఇప్పుడు వెల్లువెత్తుతున్న ఆరోపణలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇసుక, మద్యం మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్న జగన్ ఒన్లీ క్యాష్ లావాదేవీలను కొనసాగించడమే ఆయన అవినీతి తిమింగలంలా మారారనడానికి నిదర్శనమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం విధానంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ మంతా ఆన్ లైన్ లావాదేవీల వెంట పరుగులెడుతుంటే.. ఆఖరికి ఏపీ సర్కార్ బటన్ ద్వారా లబ్ధిదారులకు అందజేసే నగదు కూడా ఆన్ లైన్ ద్వారానే వెళుతుంటే ఒక్క మద్యం అమ్మకాలు మాత్రం క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో నిర్వహించడమే ఆ విధానంలో అవినీతి ఏరులై పారుతోందనడానికి నిదర్శనమని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ ఆరోపణలన్నీ ఒకెత్తు అయితే అనంతపురం లేపాక్షి భూముల విషయంలో వెల్లువెత్తుతున్న ఆరోపణలు మరొక ఎత్తు అని విశ్లేషకులు అంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ హయాంలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేర ఇందూ ప్రాజెక్ట్స్ కు ఎకరం 50 వేల రూపాయల చొప్పున వేల ఎకరాల కేటాయింపు జరిగింది. అయితే వాటిలో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు మాటే ఏత్తని ఇందూ ప్రాజెక్టులు ఆ భూములను తాకట్టు పెట్టి వేళ కోట్ల రూపాయల రుణాలను దండుకుంది. అలా దండుకున్న సొమ్ములో కొంత భాగం జగన్ కంపెనీల్లోకి పెట్టుబడులుగా మరలాయని సీబీఐ అప్పట్లో నమోదు చేసిన కేసుల విచారణ ఇంకా కొనసాగుతోంది. ఈడీ కొన్ని ఆస్తులను కూడా అటాచ్ చేసింది. దీంతో ఇందూ ప్రాజెక్ట్ చేతులెత్తేసింది. దీంతో బ్యాంకులు ఆ ప్రాజెక్టు దివాళా తీసిందని ప్రకటించేశాయి. దాంతో ఐదువందల కోట్ల రూపాయలకు ఇందు ఆస్తులను ఓ కంపెనీకి దారాదత్తం చేసేయడానికి బ్యాంకులు అంగీకరించేశాయి. అసలు బ్యాంకులు అందుకు ఎలా అంగీకరించాయో ఆర్థిక నిపుణులకు కూడా అర్థం కాక తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. ఎందుకంటే ప్రభుత్వం ఆ భూ కేటాయింపులను రద్దు చేసేసి చాలా కాలమైంది. ఆ భూములు ఇప్పుడు ఈడీ అధీనంలో ఉన్నాయి. అటువంటప్పుడు బ్యాంకులు ఆ భూములు తమ తనఖాలో ఉన్నాయంటూ.. ఏదో ఒక కంపెనీకి ఐదొందల కోట్ల రూపాయలకు అప్పనంగా అప్పగించేయడాన్ని ప్రభుత్వం అడ్డుకోవాలి. కేటాయింపులు రద్దు చేశామని నోటీసులు పెట్టాలి. అలా చేయడం లేదు. ఇందు ప్రాజెక్ట్స్ భూములపై రూ. ఐదు వేల కోట్ల వరకూ అప్పులిచ్చిన బ్యాంకులు? దివాలా ప్రక్రియలో రూ. ఐదు వందల కోట్లిస్తే చాలని అంగీకరించడం వెనుక మతలబు ఏమిటి? అలా కాకుండా ఆ భూములను వేలం వేస్తే ఇంకా ఎక్కువ సొమ్ము వస్తుంది కదా? కానీ బ్యాంకులు వేలం

వేయకుండా.. రూ. ఐదువందల కోట్లిస్తామని వచ్చిన కంపెనీకే కట్టబెట్టడానికి సిద్ధమైపోవడం వెనుక ఉన్న జగన్మాయ ఏమిటి? ఇప్పుడు లేపాక్షి నాలెడ్జ్ భూములను కొనుగోలు చేస్తున్న సంస్థలో జగన్ మేనమామ.. రవీంద్రనాథ్ రెడ్డి కుమారుడు ఒక డైరక్టర్. ఈ కంపెనీకి డబ్బులు సమకూరుస్తోంది ఏపీలో పోర్టులు.. సెజ్‌లు దక్కించుకున్న అరబిందో సంస్థ. సో భూమి గుండ్రంగా ఉంది అన్నట్లు ఎక్కడెక్కడ స్కామ్ లూ తిరిగి తిరిగి జగన్ అక్రమాస్తుల కుంభకోణం దగ్గరకే చేరుతున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇంతకీ ఇందు ప్రాజెక్టు ఆస్తులను 500 కోట్ల రూపాయల అతి చౌక ధరకు అప్పనంగా తీసేసుకుంటున్న సంస్థ పేరు ఎర్తిన్ ప్రాజెక్టు. ఆ సంస్థ డైరెక్టర్ జగన్ మేనమామ కుమారుడు. ఎర్తిన్ కు నిధులు సమకూరుస్తున్నది ఏపీలో పోర్టులు సెజ్ లను దక్కించుకున్న అరబిందో సంస్థ. దీంతో ఈ డీల్ మొత్తం క్విడ్ ప్రొకొ అంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# జూనియర్ ఎన్టీఆర్ టీడీపీని స్వాధీనం చేసుకోవాలి

తిరుపతి, ఆగస్టు 24, తెలుగు, సంస్కృతి అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జూనియర్ ఎన్టీఆర్ భేటీ కావడంపై ఆమె స్పందించారు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని లక్ష్మీపార్వతి ఆకాంక్షించారు. అంతేకాకుండా ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి తెలుగు దేశం పార్టీని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అదే తన కోరిక అని చెప్పారు. చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరించి మహానేత ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కున్నారని ఆమె ఆరోపించారు. అటు స్వర్గీయ గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను తిరుపతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు లక్ష్మీపార్వతి తెలిపారు. ఈనెల 25న తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ వేదికగా గిడుగు బాషా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. గిడుగు బాషా ఉత్సవాల సందర్భంగా రేపు ఆరుగురిని పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అటు చంద్రబాబు హయాంలో విద్యాశాఖను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని లక్ష్మీపార్వతి ఆరోపించారు. గత ప్రభుత్వం హయాంలో 30 వేల స్కూల్స్ మూత పడ్డాయన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు కు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. విమర్శలు చేస్తున్న వారు, తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేస్తున్నామంటున్న వారు వాళ్ళ పిల్లలను ఆంగ్ల భాషలో చదివించడం లేదా అని ప్రశ్నించారు. పేద పిల్లలకు ఆంగ్లభాషను అందుటులోకి తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తెలుగుకు సీఎం జగన్ ద్రోహం చేశారని కొందరు అవాస్తవాలు మాట్లాడతున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తెలుగు స్కూల్స్‌ను పెద్ద సంఖ్యలో మూసివేశారన్నారు. తెలుగు మరియు సంస్కృత అకాడమీకి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తిరుపతి గోశాల వద్ద స్థలం కేటాయించారని తెలిపారు

# కృష్ణావర్శిటీలో ఈబుక్స్

విజయవాడ, ఆగస్టు 24, రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతతో విద్య, అభ్యసన వ్యవస్థల్లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలకు వరకూ అంతా డిజిటల్ పాఠానికి అలవాటు పడ్డారు. అందుకు తగ్గట్లుగా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు అందరికీ ఉపయోగపడేలా కృష్ణా యూనివర్సిటీ అధికారులు ఈ?విజ్ఞాన భాండాగారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. వర్సిటీ క్యాంపస్‌లో డాక్టర్ అబ్దుల్ కలామ్ పేరిట అత్యాధునిక సౌకర్యాలతో డిజిటల్ లైబ్రరీని గత విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. తద్వారా డిగ్రీ, పీజీ పట్టాలతో బయటకు వెళ్లే విద్యార్థులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా సాంకేతికతతో కూడిన విజ్ఞానాన్ని పెంచుకునేందుకు అవకాశం కలి?పంచారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, వివిధ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసించే సుమారు వెయ్యి మంది విద్యార్థులు సెంట్రల్ లైబ్రరీ సద్వినియోగం చేసుకుంటున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో సాంకేతికతను జోడించారు. చదువుతున్న కోర్సులకు రిఫరెన్స్‌గా సుమారు ఒక లక్షకు పైగా ఈ?బుక్స్ అందుబాటులో ఉంచారు. కంప్యూటర్ల ద్వారా విద్యార్థులు వీటిని వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఒకే సారి వందమంది విద్యార్థులు లైబ్రరీలో కూర్చొని పుస్తకాలు చదువుకునేలా సీటింగ్ సమకూర్చారు. అంతేకాక ఇక్కడ లభ్యమయ్యే ఈ?బుక్స్ విద్యార్థులు తమ మొబైల్ లేదా వ్యక్తిగత కంప్యూటర్ ద్వారా ఎక్కడి నుంచైనా ఓపెన్ చేసుకుని చదువుకునే వెసులుబాటును కల్పించారు. విద్యార్థి ఐడీ నంబర్‌తో పాటు లైబ్రేరియన్ ఇచ్చే పాస్‌వర్డ్‌తో ఈ?బుక్స్ ఓపెన్ అయ్యే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే లైబ్రరీలో ఉచిత వైఫై అందుబాటులో ఉండటం విద్యార్థులకు మేలు చేకూరుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ సెమినార్‌లకు కృష్ణా యూనివర్సిటీ వేదికగా నిలుస్తుండటంతో పరిశోధన విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వీరికి సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ లైబ్రరీలో 20 వేలుకు పైగా ఈ?జర్నల్స్ అందుబాటులో ఉంచారు. స్కాలర్స్‌తో పాటు బోధన చేసే అధ్యాపకులు కూడా వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు.

# భూమన మాటలకు అర్థాలు వేరులే

తిరుపతి, ఆగస్టు 24, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలనే ప్రస్తుతం ఎవరికి తోచిన విధంగా వాళ్లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఎమ్మెల్యే భూమన పునర్ముద్రించిన మహాత్ముడి ఆత్మకథ సత్యశోధన పుస్తక ప్రతులను తిరుపతి సభలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భూమన చేసిన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను కొందరు చర్చకు పెట్టేశారు.. రచ్చ రచ్చ చేసేస్తున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తెలిసిన తర్వాత తల పట్టుకున్నారట ఎమ్మెల్యే భూమన. ఆ సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించినా.. నైతికత లేని రాజకీయాలు ప్రమాదకరమని.. పతనమైన వ్యక్తి అధికారంలోకి వస్తే ఒరగబెట్టేది ఏదీ లేదని ఆయన ప్రస్తావించిన మాటలను పట్టుకుని చిలువలు పలువలు చేస్తున్నారట. కార్యక్రమం విజయవంతమైందనే సంతోషం కంటే.. సోషల్ మీడియాలో అవుతున్న రచ్చే ఎమ్మెల్యే శిబిరాన్ని కలవర పెడుతోందట. పార్టీ అధినేతను ఉద్దేశించే భూమన ఆ వ్యాఖ్యలు చేశారని కొందరు ట్రోల్ చేస్తున్నారట. దీంతో ఎక్కడో తేడా కొడుతుందని భావించిన ఆయన దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు ఎమ్మెల్యే. తన ప్రసంగానికి దురుద్దేశాలు ఆపాదిస్తున్నారని.. వక్రీకరించడం బాధ కలిగిస్తోందని చెప్పారు భూమన. వైఎస్ కుటుంబంతో తనకు 48 ఏళ్ల అనుబంధం ఉందని.. తీవ్రవాద రాజకీయాల నుంచి వైఎస్ఆర్ వల్లే ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. జీవితాంతం వైఎస్ కుటుంబంతోనే ఉంటానని ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఈ వివరణను కూడా వైరిపక్షాలు.. భూమన అంటే పడని వాళ్లు విపరీతార్థాలు తీస్తున్నారని భూమన శిబిరం టెన్షన్ పడుతోందట. మంత్రి పదవి రాకపోవడం వల్లే భూమన తన మనసులోని మాటను బయటపెట్టారని టీడీపీ విమర్శలు మొదలు పెట్టింది. జనసేన, టీడీపీ సోషల్ మీడియా విభాగాలు ఆ అంశాన్నే వైరల్ చేస్తున్నాయి. మొత్తానికి భూమన ఒకటి అంటే.. అవి వేరే విధంగా ప్రచారంలోకి వెళ్లడంతో ఎమ్మెల్యే బృందం ఉలిక్కి పడింది. మరి..ఈ కొత్త సమస్యను భూమన ఎలా అధిగమిస్తారో చూడాలి.

# పార్టీలో చేరికకు గ్రీన్ సిగ్నల్

నెల్లూరు, ఆగస్టు 24, జనసేన పార్టీని పవన్ కల్యాణ్ స్థాపించి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తుంది. అయితే ఆ పార్టీలో చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ లేరు. పవన్ కల్యాణ్ సోలోగానే పార్టీని ఇప్పటి వరకూ నడుపుకుంటూ వచ్చారు. తొలుత మాదాసు గంగాధరం, జేడీ లక్ష్మీనారాయణ వంటి నేతలు ఉండేవారు. తర్వాత నాదెండ్ల మనోహర్ పార్టీలో జాయిన్ అయ్యారు. అయితే కీలక నేతలందరూ పార్టీ నుంచి వెళ్లిపోయారు. జిల్లాలో చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ ఆ పార్టీకి లేరు. ఆ పార్టీలో ఎవరూ చేరలేదు. వీరు చేర్చుకోలేదు కూడా. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రెండు ఎన్నికలు జరిగాయి. 2014లో జనసేన పోటీ చేయలేదు. టీడీపీ, బీజేపీకి మద్దతుగా నిలించింది. 2019 ఎన్నికల్లో కమ్యునిస్టులు, బీఎస్పీలతో కలసి కూటమి ఏర్పాటు చేసుకుని ఎన్నికలకు వెళ్లింది. ఒక్క సీటు మాత్రమే వచ్చింది. ఆ సమయంలోనూ పార్టీలో పెద్దగా ఎవరూ చేరలేదు. అయితే ఈసారి జనసేనలో చేరికలు ఎక్కువగా ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రధానంగా అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ నుంచి జనసేనలో చేరేందుకు నేతలు ముందుకు వస్తున్నారని చెబుతున్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి నేతల నుంచి ప్రతిపాదనలను అందుతుండటంతో పవన్ కల్యాణ్ అప్రమత్తమయ్యారంటున్నారు. మరోవైపు ఉన్న నేతల్లో కొందరు కోవర్టులు ఉన్నారని పవన్ కల్యాణ్ అనుమానిస్తున్నారు. జనసేన పార్టీ పెట్టి ఇన్నేళ్లు అవుతున్నా ఆ పార్టీకి క్రమశిక్షణ సంఘం అంటూ ఏమీ లేదు. 2019 ఎన్నికల్లో గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కూడా వైసీపీ పంచన చేరిపోయారు. అయినా ఆయనపై చర్య తీసుకోలేదు. తాజాగా నిన్న జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో క్రమశిక్షణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు కారణం చేరికలకు ఓకే చెప్పడానికేనని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చేరికలతో పార్టీలో కొంత ఊపు వస్తుందని జనసేన నేతలు నమ్ముతున్నారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీకైనా చేరికలు అవసరం. కానీ ఇప్పటి వరకూ చేరికలు లేవు. ప్రతిపాదనలు భారీగానే వస్తుండటంతో క్రమశిక్షణ సంఘాన్ని నియమించుకుందామన్న కొందరి నేతల సూచనకు పవన్ కల్యాణ్ ఒకే చెప్పినట్లు తెలిసింది. అందుకే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీలో క్రమశిక్షణ సంఘాన్ని తాజాగా నియమించారు. అసలు నేతలు ఎవరున్నారని ఆయన ఈ సంఘం పెట్టారన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినపడుతున్నాయి. ఇప్పటి వరకూ అయితే ఆ అవసరం లేదు. ముందు ముందు అవసరాన్ని గుర్తించి ఆయన క్రమశిక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారంటున్నారు. దీనికి ఆయనే ఛైర్మన్ గా ఉంటారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు చేర్చుకుని నియోజకవర్గాల్లో బలపడాలన్న ప్రయత్నంలో పవన్ కల్యాణ్ ఉన్నారని సమాచారం.

## వానాకాలంలో ఉక్కపోతలు

విశాఖపట్నం, ఆగస్టు 24, ప్రస్తుతం వర్షాకాలం నడుస్తోంది. కానీ వాతావరణం వేసవి అనుభూతిని కలిగిస్తోంది. ఒకపక్క ఉష్ణతాపం, మరోపక్క ఉక్కపోత వెరసి జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఆ సమయంలో చల్లదనం పరచుకుంటున్నా, అవి బలహీన పడ్డాక సూర్యుడు చుర్రుమంటున్నాడు. కొద్దిరోజుల నుంచి ఈ పరిస్థితులే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వీటి తీవ్రత ఒకింత ఎక్కువగానే ఉంటోంది. కొన్నాళ్లుగా విశాఖపట్నంలో సాధారణం కంటే 2?4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి వేడిని వెదజల్లుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆకాశంలో కొద్దిపాటి మబ్బులు కమ్ముకుంటున్నా వాతావరణంలో అంతగా చల్లదనం కనిపించడం లేదు. మేఘాలు కనుమరుగయ్యాక భానుడు ప్రతాపం చూపుతున్నాడు. కొద్దిపాటి సమయానికే సూర్య తాపం తీవ్రత పెరిగి చిర్రెత్తిస్తున్నాడు. మరోవైపు దీనికి ఉక్కపోత కూడా తోడవుతోంది. సాధారణంగా ఇతర ప్రాంతాలకంటే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉక్కపోత అధికంగా ప్రభావం చూపుతుంది. వేసవిలో మరింత తీవ్రరూపం దాలుస్తుంది. కానీ ప్రస్తుతం వర్షాల సీజనే అయినా అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోత కూడా కొనసాగుతోంది. ఫలితంగా జనానికి ముచ్చెమటలు పోస్తున్నాయి. దీంతో వేసవి సీజనులో మాదిరిగా పగలే కాదు.. రాత్రి వేళల్లోనూ ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను విరివిగా వినియోగించి ఉపశమనం పొందుతున్నారు. కొద్దిరోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు/ద్రోణులు గాని, ఆవర్తనాలు గాని లేవు. దీంతో వర్షాలు కూడా కురవడం లేదు. ప్రస్తుతం పశ్చిమం నుంచి తేమతో కూడిన గాలులు వీస్తున్నాయి. ఇలా విశాఖలో గాలిలో తేమ శాతం 60 నుంచి దాదాపు 90 శాతం వరకు ఉంటోంది. సాధారణంగా గాలిలో తేమ 50 శాతం ఉంటే ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అంతకుమించితే ఉక్కపోత ప్రభావం మొదలవుతుంది.ఆకాశంలో మేఘాలు ఏర్పడుతున్నా అవి వచ్చి పోతున్నాయి తప్ప స్థిరంగా ఉండడం లేదు. దీంతో సూర్య కిరణాలు నేరుగా భూ ఉపరితలంపైకి ప్రసరిస్తున్నాయి. ప్రస్తుతం విపరీతమైన ఉక్కపోతకు గాలిలో అధిక తేమ, ఉష్ణోగ్రతలు పెరుగుదలకు మేఘాలు, వర్షాలు లేకపోవడం వంటివి కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి బంగాళాఖాతంలో ఏదైనా అల్పపీడనం వంటిది ఏర్పడే వరకు కొద్దిరోజుల పాటు కొనసాగుతుందని వీరు పేర్కొంటున్నారు

# తెరపైకి రజకార్ ఫైల్స్ సినిమా

విజయవాడ, ఆగస్టు 24, బీజేపీ అగ్రనేత అమిత్ షాతో జూనియర్ ఎన్టీఆర్ భేటీ కావడం తెలుగు రాష్ట్రాల్లో చాలా మందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. కొన్నేళ్లుగా సినిమాలు తప్ప మరో ప్రపంచమే తెలియని తారక్.. మళ్లీ రాజకీయాల వైపు వస్తున్నారా..? కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో యంగ్ టైగర్ భేటీ వెనక ఆంతర్యమేంటి..? ట్రిపుల్ ఆర్ కోసమే అయితే.. రామ్ చరణ్ లేకుండా స్పెషల్ మీటింగ్ ఎందుకు..? కేంద్ర హోం మంత్రి అమిత్ షాను జూనియర్ ఎన్టీఆర్ కలవడం ఎక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంది. సినీ వర్గాల్లో కంటే.. రాజకీయంగా ఈ భేటీ గురించి ప్రత్యేకంగా చర్చ జరుగుతుంది. బీజేపీ అగ్ర నేతతో తారక్‌కు పనేంటి..? అంత ప్రత్యేకంగా ఈ ఇద్దరూ కలవడానికి కారణమేంటంటూ ఆసక్తి కరమైన చర్చ జరుగుతుంది. ట్రిపుల్ ఆర్‌లో కొమరం భీమ్ పాత్ర నచ్చి.. అమిత్ షా ప్రశంసించారని తారక్ వర్గాలు చెప్తున్న మాట. అయితే ఈ భేటీ వెనుక పాలిటిక్స్ తప్ప మరొకటి లేదన్నది మరికొందరి అభిప్రాయం. భేటీ తర్వాత ఎలాంటి లీకులు రాకపోవడంతో నిజంగా వారిద్దరూ ఏ అంశాలపై చర్చించారన్న ఆసక్తి నెలకొంటోంది.తారక్, అమిత్ షా భేటీ వెనక మరో వార్త టాలీవుడ్ వర్గాల్లో బాగా వైరల్ అవుతుంది. ది కాశ్మీర్ ఫైల్స్ తరహాలోనే.. రజాకార్ ఫైల్స్ అనే సినిమా ఒకటి త్వరలోనే రాబోతుంది. దీనికి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు కూడా. బిజేపీ ప్రభుత్వ సపోర్ట్‌తోనే రజాకార్ ఫైల్స్ భారీ ఎత్తున తెరకెక్కబోతుందనే ప్రచారం జరుగుతుంది. ఇందులో తారక్‌ను నటింపచేయాలనేది పార్టీ ఎత్తుగడలా కనిపిస్తోందని విశ్లేషకుల అభిప్రాయం. తారక్, అమిత్ షా మధ్య రాజకీయ చర్చకు తావేం లేదని.. కేవలం ఈ రజకార్ ఫైల్స్ సినిమా గురించి చర్చించుకున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అటు రాజకీయం, ఇటు సినిమాలపై పూర్తి అవగాహన ఉన్న తారక్.. తీసుకునే ఏ నిర్ణయమైనా భవిష్యత్తును అంచనా వేసుకునే నిర్ణయం తీసుకుంటారనే అతన్ని దగ్గర్నుంచి గమనించిన వాళ్ళకు అర్థమవుతుంది. మరి రజాకార్ ఫైల్స్ విషయంలో అమిత్ షా తారక మంత్రం ఎంతవరకు పని చేస్తుందనేది మిలియన్ డాలర్స్ ప్రశ్న.

టీడీపీయే టార్గెట్టా....

జూనియర్ ఎన్టీఆర్, అమిత్ షా భేటీ రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడిని కలిగించింది. జూనియర్ ను బీజేపీ భవిష్యత్ లో రాజకీయంగా ఉపయోగించుకోవడానికే ఈ భేటీ జరిగిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. బీజేపీకి తెలంగాణలో జూనియర్ అవసరం పెద్దగా లేకపోవచ్చు. ఆయన అభిమానులు తెలంగాణలో ఉన్నప్పటికీ ఇక్కడ బలపడే అవకాశాలున్నాయి. ఆల్రెడీ కాంగ్రెస్ ను వెనక్కు నెట్టి బీజేపీ ముందుకు వచ్చిందనే ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇక్కడ జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం చేసినా పెద్దగా ప్రయోజనం ఉండక పోవచ్చు. తెలంగాణలో పార్టీకి అదనపు అండగానే జూనియర్ ఉపయోగపడతారు తప్పించి ఆయనే ఇక్కడ ఓట్లు కురిపించడానికి ప్రధాన వ్యక్తిగా మారతారని అనుకోలేం.కానీ జూనియర్ ఎన్టీఆర్ వల్ల ఆంధ్రప్రదేశ్ లో ప్రయోజనం ఉంటుంది. ప్రధానంగా టీడీపీ బలంగా ఉన్నా ఆ పార్టీ నాయకత్వంపై భవిష్యత్ లో సందేహాలయితే ఉన్నాయి. చంద్రబాబు తర్వాత నారా లోకేష్ తప్ప ఎవరికీ ఛాన్స్ ఉండదన్న విషయం అందరికీ తెలుసు. నారా లోకేష్ ఇంకా రాజకీయంగా రాటు దేలలేదన్నది పార్టీ నేతలే అంగీకరిస్తున్న విషయం. చంద్రబాబుపై ప్రజల్లోనూ, క్యాడర్ లోనూ విశ్వాసం ఉన్నట్లు నారా లోకేష్ పై కన్పించడం లేదు. రాజకీయ అంశాలపై అవగాహన లోపంతో పాటు ఆయన ప్రత్యర్థులపై చేస్తున్న విమర్శలు కూడా పెద్దగా పేలడం లేదు. అందుకే నారా లోకేష్ సారథ్యంలో పార్టీ బలోపేతం అవుతుందని మాత్రం ఇప్పటి వరకూ అయితే ఎవరూ నమ్మడం లేదు. భవిష?యత్ లో ఆయన తండ్రిమాదిరిగా వ్యూహాలను రచించడంలో దిట్ట అవుతారామో కాని ఇప్పటి వరకూ అయితే లోకేష్ ను నాయకుడిగా అంగీకరించని వారే అధికంగా ఉన్నారు. నందమూరి బాలకృష్ణ ఉన్నా ఆయన ఫుల్ టైం రాజకీయ నేతకాదు. పార్టీ పగ్గాలు కూడా చేపట్టే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఎక్కడకు వెళ్లినా జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలే కనిపిస్తుండటం ఇందుకు ఉదాహరణ. పార్టీ అభిమానులు, కింది స్థాయి క్యాడర్ జూనియర్ ఎన్టీఆర్ పార్టీలో క్రియాశీలకంగా మారాలని భావిస్తున్నారు. కానీ జూనియర్ మాత్రం తనకు ఇప్పుడే రాజకీయాల్లో రావాలని ఆలోచన చేయడం లేదని చెబుతూ వస్తున్నారు. అలాగని టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేయరని కూడా చెప్పలేం. చంద్రబాబు ఇప్పటికే ఎన్టీఆర్ కుటుంబంతో మరింత సఖ్యతగా మెలిగేందుకు సిద్ధమవుతున్నారు. తన చిరకాల ప్రత్యర్థి అయిన దగ్గుబాట ? వెంకటేశ్వరరావును కూడా దువ్వడానికి సిద్ధమయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ ను ప్రచారంలోకి తీసుకు రావడం ఆయనకో పెద్ద లెక్కకాదన్నది పార్టీ వర్గాల

నుంచి వినిపిస్తున్న టాక్. . అందుకే ముందుజాగ్రత్తగా బీజేపీ అప్రమత్తమయినట్లు కనపడుతుంది. జూనియర్ కు టీడీపీ నాయకత్వం అప్పగిస్తే ఏ ఇబ్బంది ఉండదు. ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకోవచ్చు. జూనియర్ ని టీడీపీ దూరం పెడితే తాము దగ్గరకు తీయాలన్న లక్ష్యంతో ఒక చిన్న పాటి ప్రయత్నం చేసినట్లు కనపడుతుంది. ఎటూ బీజేపీలో జూనియర్ ఎన్టీఆర్ అత్త, ఎన్టీఆర్ కుమార్తె పురంద్రీశ్వరి బీజేపీలో క్రియాశీలంకగా వ్యవహరిస్తున్నారు. ఆమెకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను కూడా అప్పగించాలన్న యోచనలో బీజేపీ నాయకత్వం ఉంది. చంద్రబాబును, ఆయన పార్టీని ఏపీలో డల్ చేయగలిగితే బీజేపీ పుంజుకునే అవకాశాలున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ మద్దతిస్తే బీజేపీలో చేరికలు కూడా భారీగా ఉంటాయి. ఒక ప్రధాన సామాజికవర్గం కూడా అండగా నిలిచే అవకాశం ఉంటుంది. ఇక ఆయన ఫ్యాన్స్ సంగతి సరేసరి. ఇన్ని లెక్కలు వేసే అమిత్ షా జూనియర్ ఎన్టీఆర్తో భేటీ అయ్యారంటున్నారు. బీజేపీ వాడుకుంటే ఎవరినైనా మామూలుగా వాడుకోదు. ఆ సంగతి అందరికీ తెలిసిందే. అందుకే జూనియర్ తో జట్టు కట్టేందుకే అమిత్ షా భేటీ అయ్యారన్నది రాజకీయ విశ్లేషకులు అంగీకరిస్తున్న విషయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## పోలవరం నీటితో ఎకరాలకు నీరు

ఏలూరు ఆగస్టు 24, పోలవరంలోనే ఉంది వరం. నిర్మాణ దశలోనే రైతులకు వరంగా మారింది. వర్షాధారంతోనే సాగయ్యే మెట్ట భూములకు పనులు పూర్తి కాకుండానే సాగునీరందిస్తోంది. ఇప్పటి వరకు పోలవరం ఎడమ కాలువ 80 శాతం పనులు పూర్తి కాగా ప్రాజెక్టు పనులు తుది దశకు చేరుకున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో పోలవరం కాలువ వేల ఎకరాలలో పంటలకు నీరందించి సిరులు కురిపిస్తోంది. కాలువ తవ్విన ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలకళ ఉట్టిపడుతోంది. ఎక్కడ చూసినా కాలువ నిండా నీటి నిల్వలు ఉండడంతో సమీప పొలాలకు రైతులుమోటార్ల ద్వారా నీటిని తోడి సాగు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా పోలవరం కాలువపై ఆధార పడి జిల్లాలో సుమారు 2580 ఎకరాల వరకూ మెట్ట భూముల్లో 2300 ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు. అపరాల నుంచి వరి వరకు పోలవరం కాలువపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇంకా ప్రారంభం కాకుండానే రైతులకు ఉపయోగపడుతున్న ఈ కాలువ పనులు పూర్తయితే వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలమవుతాయి. వర్షాకాలంలో కాలువ నిండుగా మారి ఎద్దడి సమయంలో సాగు చేసే రబీ పంటకు నీరందిస్తోంది. జగ్గంపేట, ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం, తొండంగి, గొల్లప్రోలు తదితర మండాలల్లో ఎక్కువగా పంట పొలాలకు రబీ సీజన్‌లో నీటి ఎద్దడి ఎదురవుతుంది. అలాంటి సమయంలో కాలువ చివరి భూములకు, మెట్ట భూములకు ప్రస్తుతం పోలవరం కాలువే నీటి వనరుగా మారిపోయింది. కాలవకు ఆనుకుని కిలో మీటరు దూరంలో ఉన్న అన్ని భూములకూ రైతులు ఇంజిన్ల ద్వారా నీటిని తోడుకుంటున్నారు. సాగు చేసుకుంటున్నారు. వర్షాల కోసం ఎదురు చూడకుండా కాలువలోని నీటి సహాయంతో ముందుగా నారు మళ్లు వేసుకుంటున్నారు. నీటి ఎద్దడి ఎదురైతే వెంటనే ఇంజిన్ల సహాయంతో నీటిని తోడి పంట ఎండిపోకుండా కాపాడుకుంటున్నారు. కాలువు సమీపంలోని రైతులు ఇంజిన్లతో నీటిని తోడుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. దీంతో ఎక్కువ మంది కలిసి నిధులు సమకూర్చుకుని పెద్ద ఇంజిన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎనిమిదెకరాలు సాగు చేస్తున్నాను. కాలువ తవ్వక ముందు నీటి ఎద్దడి వస్తే పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలు వచ్చేవి. ఎనిమిదేళ్లుగా పోలవరం కాలువ అండగా నిలిచింది. ఖరీఫ్ నుంచి రబీ, అపరాల సాగు వరకు నీటి ఎద్దడి ఎదురైనా ఇబ్బంది లేకుండా ఉంటోంది. పక్కనే కాలువ నిండా ఎప్పుడు నీరు ఉంటుండడంతో మాకు భయం లేకుండా పోయింది. ఒక వేళ నీటి ఎద్దడి వస్తే ఇంజన్లతో నీరు తోడుకుని సాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నాం.

## బీసీల రిజర్వేషన్ పితామహుడు బిపి మండల్



బిందేశ్వరి ప్రసాద్ మండల్ భారతదేశ పార్లమెంటు సభ్యుడు, మాజీ బీహార్ ముఖ్యమంత్రి ,సంఘ సంస్కర్త. అతను రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ (మండల్ కమిషన్ గా సుపరిచితం) కు చైర్మన్ గా వ్యవహరించాడు. అతను ఉత్తర బీహార్ లోణి సహర్సా లో అత్యంత ధనుకులైన యాదవ్ జమీందారీ (భూస్వాములు) కుటుంబం లో నన్మించాడు. కమిషన్ భారతదేశంలోని ప్రజలలో ఒక భాగాన్ని "అదర్ బేక్ వర్డ్ క్లాసెస్"(ఓబీసీ) (ఇతర వెనుకబడిన కులాలు) గా నివేదిక ప్రకారం నివేదించింది. భారతీయ రాజకీయాల్లో తక్కువగా ఉన్న, బలహీన వర్గాల కోసం పాలసీపై తీవ్రమైన చర్చ ప్రారంభమైంది. బి.పి. మండల్ ( బిందేశ్వరి ప్రసాద్ మండల్ ) బీహార్ లోని బనారస్ లోని ఒక యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని , దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930 లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.మండల్ తన 23 వయేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు. 1945-51 మధ్య కాలములో మాధేపుర డివిజన్ లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గా పని చేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షములో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965 లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షములో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని

-నేడు ఆయన జయంతి

చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి) లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు.1967 లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967 లో 69 సీట్లు వచ్చాయి. బీహార్లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేర్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వములో కొన్ని విబేధాలు రావడముతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ భాద్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమిషన్ వేసి విచారణ చేయించాడు. ఆ కమిషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడముతో ప్రభుత్వముపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, "ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు" అని చెప్పే మండల్ తన ప్రభుత్వములో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.1967 మార్చి 5న అతను సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ ) ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నాడు. 1972 లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974 లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితంలో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పని చేసాడు.మండల్ కమిషన్ 1978 డిసెంబరులో మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులు గల పౌర హక్కుల కమిషన్ వేసాడు దీనిని మండల్ చర్మన్ గా వ్యవహరించాడు. అతని కమిషన్ నివేదిక 1980 డిసెంబర్ 31 లో పూర్తయింది. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒ.బి.సి) అభ్యర్థులకు రిజర్వు సీట్లను ఒక నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిపారసు చేసాడు. కమిషన్ నివేదిక ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పరిశీలనలోకి వచ్చింది. కానీ అమలు జరగలేదు.

## మట్టి గణపతే..మహాగణపతి

మట్టి విగ్రహాలను సిద్ధం చేస్తున్న పీసీబీ

హైదరాబాద్, ఆగస్టు 24, (న్యూస్ పల్స్)పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాల బదులు సహజరంగులు, మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఏటా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా లక్ష మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనుంది. ఇందుకు సంబంధించి



వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారుల సాయంతో సహజరంగులు కొనుగోలు చేసి కుమ్మరి వృత్తిదారులకు ఇప్పటికే ఆర్డర్ ఇచ్చింది. 8 అంగుళాల ఎత్తు ఉండే ఈ మట్టి విగ్రహాలను గ్రేటర్‌లో 60 వేలు, జిల్లాల్లో 30 వేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 10 వేల చొప్పున అందజేయనున్నారు. విగ్రహాల తయారీ, పంపిణీ కోసం పీసీబీ రూ.55 లక్షలు వెచ్చిస్తోందిపర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే పూజించేలా.. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి లక్ష మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నది. మట్టి గణపతులే పూజిద్దాం.. అంటూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందు కుగాను తమ వంతు బాధ్యతగా ఉచితంగా 8 అంగుళాల ఎత్తుతో కూడిన మట్టి విగ్రహాలను తయారు చేయించి, ఉచితంగా అందించాలని పీసీబీ నిర్ణయించింది. రసాయన రహిత గణపతి విగ్రహాల తయారీపై అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మట్టితో విగ్రహాలను తయారు చేయడంతో పాటు వాటికి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికాలు ఎంపిక చేసిన సహజ రంగులను వినియోగించేలా చర్యలు చేపట్టారు. కుమ్మర వృత్తి దారులకు మట్టి విగ్రహాల తయారీని అప్పగించారు.ప్రతియేటా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల్లో పాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు కాకుండా పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను నగర ప్రజలకు ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలోనే 60వేల మట్టి విగ్రహాలను జోన్‌లు, సర్కిల్ కార్యాలయాల వారీగా ఆయా ప్రాంతాల్లో తయారు చేయించి పంపిణీ చేసే బాధ్యతలను జీహెచ్ఎంసీకి అప్పగించారు. రాష్ట్రంలోని 30 జిల్లాల్లో వెయ్యి విగ్రహాల చొప్పున పంపిణీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. మరో 10వేల విగ్రహాలు పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.55 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

## శాఖలకు సలహాదారులేందుకు ?

అమరావతి దేవాదాయశాఖ సలహాదారుగా జె.శ్రీకాంత్ నియామకంపై హైకోర్టు స్టే విధించింది. శ్రీకాంత్ నియామకాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయిన విషయం తెలిసింది. బుధవారం నాడు పిటిషన్ పై సీజే ప్రశాంత్కుమార్ మిశ్రా, జస్టిస్ సోమయాజులు ధర్మాసనం ఎదుట విచారణ జరిగింది. శ్రీకాంత్ నియామక జీవోను నిలిపివేస్తూ హైకోర్టు స్టే ఇచ్చింది. ఇలానే వదిలేస్తే రేపు అడ్వకేట్ జనరల్ను సలహాదారుని నియమిస్తారు. సలహాదారులను నియమించేందుకు అధికారుల కొరత ఉందా. సలహాదారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారన్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. మంత్రులకు సలహాదారులు ఉంటే అర్థం ఉంది. శాఖలకి సలహాదారు ఏమిటని ప్రశ్నించింది.

## చందర్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

చందర్లపాడు ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు గ్రామంలో "గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు నిర్వహించారు. చందర్లపాడు గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో అయన ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు , ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు ,సాగునీరు -డ్రైనేజీలు -సిమెంట్ రోడ్ల ఏర్పాట్లకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని తెలిపారు , ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు ,

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం జిల్లా ఎస్పీ

నందికొట్కూర్నంద్యాల జిల్లా నందికొట్కూరు సర్కిల్ పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఉన్న కేసుల వివరాలను స్థానిక ఎస్ఐ ఓబులేసు ని అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ముఠాలు వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు .పొరుగు రాష్ట్రమైన తెలంగాణ సరిహద్దు నుండి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం ,తో పాటు స్థానికంగా గ్రామీణ ప్రాంతాలలో బెల్టుషాపు ,నాటుసారా సరఫరా తయారు చేసే నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు .ప్రభుత్వం పేదల కొరకై చౌక దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు వ్యక్తుల పై కేసు నమోదు చేస్తామన్నారు .ఇప్పటికే కొందరి పై అక్రమ బియ్యం సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు .కరోనా సమయంలో తెలంగాణ నుండి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తుల పై కేసు నమోదు చేయడంతోపాటు వాహనాలను పెద్ద సంఖ్యలో సీజ్ చేయడం జరిగిందని సీజ్ చేసిన వాహనాలను పై అధికారులతో సంప్రదించి త్వరలోనే వాహనాలపై వేలంపాటనిర్వహిస్తామని తెలిపారు .బ్రాహ్మణ కోడూరు పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు .పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తీసుకోవలసిన సూచనలు సలహాలను పోలీసు సిబ్బందికి సూచించారు .పోలీస్ స్టేషన్ ఆవరణంలో పర్యావరణం పరిశుభ్రత పాటించాలని ఆయన తెలిపారు ఎస్పీ వెంట ఆత్మకూరు డిఎస్పి వై .శృతి ,నందికొట్కూరు రూరల్ సిఐ సుధాకర్ రెడ్డి ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## అది ఆంధ్ర పాఠశాల లో అదనపు గదుల నిర్మాణ పనులకు భూమిపూజ

ఎమ్మిగనూరు పట్టణంలోని ఎం బి చర్చి ఇంట్లో ఉన్న పాఠశాలకు అదనపు గదులు కోసం నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" భూమి పూజ చేశారు. , ఈ సందర్భంగా ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మన జగనన్న పాలనలో విద్యకు పెద్దపీట వేశారని, ప్రతి విద్యార్థిని విద్యార్థి చదువు కోవడానికి ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపొందించి. అక్కడి కంటే ఉన్నతమైన నాణ్యతతో కూడిన విద్యను అందించడం జరుగుతుంది అన్నారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు పారదర్శకంగా ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా నేరుగా అకౌంట్లోకి జమచేసున్న ఘనత మన ముఖ్యమంత్రి జగన్ కె దక్కుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ అగ్గిరప్ప, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు వైస్ చైర్మన్ కె. దివ్యకళ, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, కోశాధికారి తారా రాజశేఖర్, అధికార ప్రతినిధి కె. సునీల్ కుమార్, మైనార్టీ నాయకులు రియాజ్ ఆహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఎం. క్రిష్ణా, ఏఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, సోషల్ మీడియా టీం, నాయకులు, కార్యకర్తలు పాఠశాల హెచ్.ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాలకు గిరాకి

బద్వేలు బద్వేలులో వినాయక స్వామి విగ్రహాలకు మంచి గిరాకీ ఏర్పడింది. మహమ్మారి కారణంగా గత 2 సంవత్సరాలుగా బహిరంగ వినాయక ఉత్సవాలకు ప్రజలు దూరంగా ఉన్నారు. ఇప్పుడు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమైన చోటా లంబోదరుడు విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు అన్ని సన్నాహాలు చేస్తున్నారు. బద్వేలు పట్టణములో దాదాపు 200 పైగా వినాయక స్వామి విగ్రహాలు ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో వినాయక స్వామి విగ్రహాలు ప్రతి పల్లెలో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి లో భారీ వినాయక స్వామి విగ్రహం ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే పలుచోట్ల భారీ వినాయక స్వామి విగ్రహాలు నెలకొల్పుతారు. పట్టణంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు కళాకారులు వినాయక విగ్రహాలు తయారుచేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఒక్కొక్క విగ్రహం ఎనిమిది వేల నుంచి 40 వేల రూపాయలు పలుకుతుంది. వీటిని కూడా మంచి డిమాండ్ ఇప్పుడు ఏర్పడింది. ముఖ్యంగా యువత ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు తమ ప్రాంతాల్లో నెలకొల్పేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు. అలాగే చలువ పందిళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశాలలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి...

**రూరల్ సీఐ రామకృష్ణా రెడ్డి**

తుగ్గలి బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని పత్తికొండ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి తెలియజేశారు. బుధవారం రోజున తుగ్గలి పోలీస్ స్టేషన్ నందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన తెలియజేశారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు కమిటీగా ఏర్పడి ఆధార్ కార్డులను అందజేసి పోలీసుల ద్వారా అనుమతులు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.అదేవిధంగా నిమజ్జన సమయంలో డీజే లకు అనుమతి లేదని, నిమజ్జన సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.నిమజ్జన సమయంలో ప్రజలు మద్యపానం సేవించరాదని ఆయన తెలియజేశారు.వినాయక మండపాల దగ్గర చక్కటి లైటింగ్ వసతి ఏర్పాటు చేసుకొని, రాత్రిపూట సమయంలో విగ్రహాల దగ్గర కమిటీ సభ్యులు ఉండాలని సిఐ రామకృష్ణా రెడ్డి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి ఎస్సై మల్లికార్జున,ఏఎస్ఐ నరసప్ప మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యమ్ యల్ సీ ఇసాక్ బాషను కలసిన గణేష్ మహోత్సవ కమిటీ

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు గంగిశెట్టి విజయ్ కుమార్ మరియు కమిటీ సభ్యులు శాసన మండలి సభ్యులు ఇసాక్ భాషా ని సెప్టెంబర్ 4న జరగబోవు సామూహిక వినాయక నిమజ్జోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మరియు అధికారులను సమన్వయపరిచి ఉత్సవాలు సజావుగా జరగడానికి సహకరించాలని కోరడం జరిగింది. యమ్ యల్ సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ కరోనా తరువాత జరుపుకుంటున్న అతిపెద్ద కార్యక్రమమైనటువంటి వినాయక నిమజ్జోత్సవ కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొంటానని ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకోవాలని అందుకు అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుస్తానని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు

# కౌమార బాలికలకు ఆరోగ్య అవగాహన చాలా అవసరం




**జాయింట్ కలెక్టర్ మౌర్య**

నంద్యాల నంద్యాల ఐఎంఏ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో బుధవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో కౌమార బాలికల ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు.మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలోజాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ముఖ్యఅతిథిగా , రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ రవి కృష్ణ గౌరవ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మౌర్య మాట్లాడుతూ కౌమార బాలికలకు అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు, సందేహాలు ఉంటాయని వాటిని నిపుణులు నివృత్తి చేసి సరైన సలహాలు ఇవ్వడం ద్వారా వారు విద్య మీద దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం పెరుగుతుందని అన్నారు. ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఈ సదస్సులు తరచూ నిర్వహించడం అభినందనీయమన్నారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైద్య అవగాహన సదస్సులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. బాలికలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ రవి కృష్ణ , మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి, కార్యదర్శి డాక్టర్ లక్ష్మి సౌజన్య మాట్లాడుతూ ఐఎంఏ అనుబంధ విభాగాలైన మహిళా విభాగం, మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో వైద్య అవగాహన సదస్సులు, గిరిజన, గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాల్ని తరచూ నిర్వహిస్తామని అన్నారు.ఈ సదస్సులో రక్తహీనత పౌష్టికాహారం అంశంపై స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ శిల్ప, కౌమార బాలికల సాధారణ చర్మవ్యాధులపై చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సుష్మ, కౌమార బాలికల మానసిక సమస్యలు వాటిని ఎదుర్కొనే విధానాలపై మానసిక వ్యాధి నిపుణురాలు డాక్టర్ ఆరిఫా బాను విద్యార్థినులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుళ్ళా, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నర్మదా, డాక్టర్ వసుధ, ఐఎంఏ నంద్యాల మెడికల్ స్పెషాలిటీస్ విభాగం కార్యదర్శి డాక్టర్ హరిత, డాక్టర్ నెరవాటి అరుణ, డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ శశి కిరణ్, డాక్టర్ మాధవి, డాక్టర్ జాస్మిన్, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య ,ఎన్ .సీ .సీ ఆఫీసర్ లలితా సరస్వతి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ రమణమ్మ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.కళాశాల, ఐఎంఏ తరపున వైద్యులను, జాయింట్ కలెక్టర్ ను రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు.

# గడప గడపకు వెళ్లడానికి కలెక్టర్లు ఏమైనా వైసీపీ కార్యకర్తలా

**మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్**

నంద్యాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి జిల్లా లో ఉన్న కలెక్టర్లు ప్రతి నియోజకవర్గ వర్గం లో ఉన్న గడప గడప కి తిరగాలి అని ఆదేశం ఇచ్చారు. ప్రతి నెలకి 6 సచివాలయలు లో గడప గడప సందర్శించండి దీని పై తానే ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాను అని తన స్వగృహం లో స్పందన కార్యక్రమంలో చెప్పడం సిగ్గు చేటు అని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ మండి పడ్డారు. జిల్లా అధికారులు ,కలెక్టర్లు ఏమైనా వైసీపీ కార్యకర్తల అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగాన్ని గత ప్రభుత్వాల్లో వికేంద్రీకరణ చేసి సేవలందించారు కానీ జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తమ సేవను అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన తెలియజేశారు. వెంటనే జగన్మోహన్ రెడ్డి గారు తీసుకొచ్చిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహ్మద్ కోరారు.

# నిరుద్యోగ యువతను వైసిపి మోసం చేస్తుంది. -- టిడిపి

నందికొట్కూరు:- నిరుద్యోగ యువతను వైసిపి మోసం చేస్తుంది.అని టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి అన్నారు. ఏపీ మోడల్ స్కూల్లో నియామకాలు రాజకీయ నియామకాలుగా మారిపోయాయి. అధ్యాపకుల పోస్టుల విషయంలో అధికారులు, వైసీపీ నాయకుల కుమ్మక్కై పోస్టులను అమ్ముకుంటూ, నిరుద్యోగ యువతకు ద్రోహం చేస్తున్నారు, నిరుద్యోగుల ఆశయాలను నీరుగారిచే విధంగా డబ్బులే ప్రధాన ధ్యేయంగా నియామకాలు చేపట్టడం సమంజసం కాదని, తక్షణమే మెరిట్ లిస్టులో విడుదల చేసి, మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేస్తే ఏపీ మోడల్ స్కూల్స్ విద్యా ప్రమాణాలు బాగుంటాయని, వాటిని ఏర్పాటు చేసిన ఉద్దేశం నెరవేరుతుందని, ఇలా దొడ్డి దారిన ఎలాంటి అర్హతలు, మెరిట్ లేని వాళ్లను వైసీపీ నాయకులు డబ్బులు తీసుకుని నియమిస్తే ఆ పాఠశాలలు నిర్వీర్యం అయిపోతాయని, కోటి ఆశలతో విద్యార్థులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను ఏపీ మోడల్ స్కూల్లో చదివిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని భావిస్తున్నారు, అలాంటి ఉన్నతమైనటువంటి ఈ మోడల్ పాఠశాల లో టీచర్ పోస్టుల భర్తీ నియామకాల కు సంబంధించి ఎలాంటి అర్హతలు మెరిట్ లేనటువంటి వారిని వైసీపీ రాజకీయ నాయకులు నియామకాల లో తల దూర్చి లక్షల దండుకుంటూ నిరుద్యోగుల కడుపు కొడుతున్నారని, తక్షణమే అధికారులు ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ను మెరిట్ లిస్టు ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలని లేని పక్షంలో అర్హత పరీక్షలను నిర్వహించి అందులో మెరిట్ సాధించినటువంటి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ మోడల్ స్కూల్స్ యొక్క విద్యా ప్రమాణాలను, విలువలను పెంచాలని, రాష్ట్రంలో ఉన్న అనేకమంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో, పట్టణాలలో రూములు తీసుకొని వేల రూపాయలు ఖర్చు చేసుకుంటూ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ కు ప్రిపేర్ అవుతున్నారని, అలాంటి నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపించే విధంగా ఈ నియామకాల లో కూడా రాజకీయ నాయకులు తల దూర్చి విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని, విమర్శించారు.



# వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

**-దర్గామిట్ట పోలీస్ స్టేషన్ సీఐ**

నెల్లూరు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని నెల్లూరు దర్గా మిట్ట పోలీస్ స్టేషన్ సిఐ పేర్కొన్నారు . స్థానిక స్టేషన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాయి చంద్ అనబడే అతను వాళ్ళ అమ్మ ప్రభుత్వ మెడికల్ కాలేజీ నందు ల్యాబ్ అటెండర్ గా విధులు నిర్వహిస్తున్నందున బాధితుడు కిరణ్ కు జీజీహెచ్ నందు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకున్నట్లు ఫిర్యాదు ఉందన్నారు. 8 నెలల క్రితం నవాబుపేటకు చెందిన జి. కిరణ్ అనే బాధితుని వద్ద నుండి సాయి చంద్ 20,000/- నగదు తీసుకున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ క్రమంలో ఉద్యోగం ఇప్పించక, నగదు తిరిగి ఇవ్వకుండా బాధితునికి సమాధానం చెప్పకుండా

సాయి చంద్ తిరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ విషయమై బాధితుడు కిరణ్ స్పందన కార్యక్రమంలో నిర్ణయించుకున్నట్లు ఫిర్యాదు ఉందన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు సాయి, బాధితుని ఇరువురుని మంగళవారం సాయంత్రం పిలిచి విచారించి పంపడం జరిగిందని సీఐ తెలిపారు.దర్గామిట్ట స్టేషన్ నందు అతీ.ఔసీ.135/2021 జ/బ 448, 290, 353, 324, 506 తీ/లి 34 ఎఖఅ కేసులో ముద్దాయిగా ఉన్న సాయి చంద్, పై కేసులో ప్రభుత్వ ఉద్యోగిపై మూకుమ్మడిగా దాడి చేసి రక్తగాయాలు కనిపిస్తున్నాయన్నారు. గతంలో సాయి మీద పలు కేసులు ఉన్నాయని, మంచి నడవడికతో జీవించాలని, నేరాల జోలికి వెల్లవద్దని పోలీసులు సూచించడం జరిగిందన్నారు.2021లో ఉద్యోగి దాడి చేసిన దానికి, ప్రస్తుతం ఉద్యోగం పేరుతో మోసం చేసన బాధితునికి ఏవిధంగా న్యాయం చేస్తారో తెలపాలని ప్రశ్నించారు.

# పుష్ప 2.. అప్పుడే ఓ పనైపోయింది!

క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కలయికలో రాబోయే పుష్ప సెకండ్ పార్ట్ పై అంచనాలు రోజురోజుకు అమాంతంగా పెరిగిపోతున్నాయి. ఇంతవరకు ఈ సినిమాకు సంబంధించిన ఒక పోస్టర్ కూడా అయితే విడుదల అయ్యింది లేదు. ఇక సెకండ్ పార్ట్ లో అల్లు అర్జున్ ఏ విధంగా కనిపిస్తాడు అలాగే ఆ సినిమా ఇంకా ఎలా ఉండబోతోంది అనే విషయాలు ప్రేక్షకులను ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నాయి.పుష్ప పార్ట్ 1 భారీ స్థాయిలో విజయం సాధించడంతో ఇప్పుడు సెకండ్ పార్ట్ మేకింగ్ విషయంలో చిత్ర యూనిట్ పై తీవ్ర ఒత్తిడి అయితే పెరిగింది. ఇక దర్శకుడు సుకుమార్ అయితే ఆ ఒత్తిడిని



జయించే విధంగా బలమైన స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. స్క్రిప్ట్ మొత్తం సిద్ధమైన తర్వాతనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని అనుకున్నారు.ఇక రీసెంట్ గా ఆ పనులు పూర్తిగా కావడంతో నేడు పూజా కార్యక్రమాలతో సినిమాను లాంచ్ చేసి త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలు పెట్టబోతున్నారు.అయితే మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాతో మరోసారి తన బలాన్ని చూపించాలని అనుకుంటున్నాడు. యూరప్ లో ఇటీవల దర్శకుడు సుకుమార్ అలాగే పాటల రచయిత చంద్రబోస్ ముగ్గురు కూడా ప్రత్యేకంగా కూర్చునే కొన్ని ట్యూన్స్ కూడా రెడీ చేసుకున్నట్లుగా తెలుస్తోంది.ముఖ్యంగా ఐటమ్ సాంగ్ అయితే దాదాపు లిరిక్స్ తో సహాసిద్ధమైనట్లు సమాచారం. దేవి అదిరిపోయే ట్యూన్స్ తో ఆకట్టుకోబోతున్నట్లుగా తెలుస్తోంది. పుష్ప పార్ట్ 1 లో ఊ అంటావా.. అనే ఐటెం సాంగ్ ఏ స్థాయిలో సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఇప్పుడు అంతకుమించి అనేలా ఉండాలి కాబట్టి దేవి గట్టిగానే ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఇక సమంత కంటే ఈసారి మరొక బాలీవుడ్ బ్యూటీని ఐటమ్ సాంగ్ కోసం సంప్రదించే ఛాన్స్ ఉంది.అంచనాలు పెరిగాయి కాబట్టి ఏ విషయంలో కూడా నిర్మాతలు తగ్గకూడదు అని అనుకుంటున్నారు. అసలైతే మొదటి పార్ట్ షూటింగ్ జరిగినప్పుడే సెకండ్ పార్ట్ కు సంబంధించిన కొంత షూటింగ్ కూడా షూట్ చేశారు. కానీ ఇప్పుడు అంచనాలు పెరిగిపోవడం వలన మళ్లీ సెకండ్ పార్ట్ లో మొత్తాన్ని కూడా హైలెట్గా తెరపైకి తీసుకురావాలి అని కథలో కూడా మార్పులు చేయాల్సి వచ్చింది. మరి ఈ మార్పులతో సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# హీరోయిన్ కోసం దేశం దాటిన యంగ్ మేకర్

హీరోయిన్ల విషయంలో మేకర్స్ ఏమాత్రం తగ్గడం లేదు. క్రియేటివ్ పరంగా రాజీ పడే ప్రశక్తే లేదంటున్నారు. హీరోయిన్ల కోసం ఏకంగా దేశాలే దాటిపోతున్నారు. పాత్ర డిమాండ్ చేస్తుంది కాబట్టి తప్పడం లేదంటున్నారు. ఇటీవలే 'ఆర్ ఆర్ ఆర్' సినిమా కోసం బ్రిటన్ మోడల్ ఒలివియా మోరీస్



ఏరికోరి మరి తీసుకొచ్చారు. ఆ పాత్ర కి ఆమె మాత్రమే న్యాయం చేయగలదని భావించి రాజమౌళి తొలిసారి దేశం దాటాడు.సినిమాలో ఆ పాత్రని పెద్ద సక్సెస్ చేసాడు. రాజమౌళి ఏకంగా దేశం దాటడంతో అప్పట్లో కాస్త వ్యతిరేక పవనాలు వీచాయి. ఇండియాలో ఆమె అంత గొప్ప నటి లేదని...ఇంగ్లీష్ వాళ్లకు అవకాశాలు ఇస్తున్నారా? అని విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పటికీ కొంత మంది స్టార్ హీరోయిన్లు ఈ విషయంలో అసంతృప్తిగానే ఉన్నారు.తాజాగా రాజమౌళి మార్గంలోనే యంగ మేకర్ ...'జాతిరత్నాలు' ఫేం అనుదీప్ కూడా వెళ్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ యువ దర్శకుడు కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ తో ' ప్రిన్స్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ గా ఉక్రెయిన్ నటి మరియా ని తీసుకున్నాడు. ఆ పాత్రపై షూటింగ్ కూడా పూర్తిచేసాడు. ఈ విషయాన్ని మరియానే మీడియాకి రివీల్ చేసింది."ఈ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. మంచి సృజనాత్మక బృందంతో కలిసి పనిచేయడం మరిచిపోలేని అనుభూతినిచ్చింది. సినిమా సెట్ లో అంతా స్నేహితుల్లా కలిసిపోయేవారు. ఇప్పుడు వీళ్లందర్నీ మిస్ అవుతున్నా. సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నాని" చెప్పుకొచ్చింది. మరి ఉక్రెయిన్ నుంచే నటిని తీసుకొచ్చారంటే? ఆ పాత్ర ప్రత్యేకత ఏంటి? అన్నది దర్శకుడు రివీల్ చేస్తే గానీ క్లారిటీ రాదు.అయితే ఇలా ఉక్రెయిన్ భామని తీసుకురావడం...ఆమె పాత్రకి సంబంధించిన షూటింగ్ పూర్తిచేయడం అంతా వేగంగా..గోప్యంగా జరిగిపోయిందంటున్నారు.ఆ కారణాలు ఎలా ఉన్నా? ఇలాంటి యువ మేకర్లు సైతం తమదేశం నటుల్ని కాదని పరదేశీ నటులకు అవకాశం కల్పించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కనీసం స్థానిక హీరోయిన్లపై పనికొస్తుందా? లేదా? అని టెస్ట్ షూట్ కూడా నిర్వహించకుండా నేరుగా ఉక్రెయిన్ నటిని తీసుకోవడం పట్ల కొంత మంది హీరోయిన్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 100 కోట్ల క్లబ్ లో చందూ మొండేటి!




యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నిఖిల్ నటించిన సూపర్ నేచురల్ మిస్టిక్ థ్రిల్లర్ 'కార్తికేయ 2'. టాలెంటెడ్ డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వం వహించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పీపుల్ మీడియా బ్యానర్ లపై తెరకెక్కిన ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించింది. రెండు దఫాలుగా రిలీజ్ వాయిదా పడుతూ వచ్చిన ఈ మూవీ ఎట్టకేలకు ఆగస్టు 13న వరల్డ్ వైడ్ గా విడుదలై సంచలనం సృష్టిస్తోంది.సినిమాలోని కృష్ణ తత్వం బోధపడటంతో ఉత్తరాది ప్రేక్షకులు ఈ మూవీకి బ్రహ్మరథం పడుతున్నారు. ముందు భారీ సినిమాల కారణంగా ఉత్తరాదిలో అత్యంత తక్కువ థియేటర్లలో విడుదలైన ఈ మూవీ తొలి రోజు హిందీ వెర్షన్ కేవలం రూ. 7 లక్షలు మాత్రే రాబట్టగలిగింది. మౌత్ టాక్ స్ప్రెడ్ కావడం.. ఈ మూవీకి ముందు విడుదలైన 'లాల్ సింగ్ చడ్డా' రక్షా బంధన్' చిత్రాలు ఫ్లాప్ లుగా నిలవడంతో 'కార్తికుయ 2'కు భారీ ఆదరణ పెరిగింది. అంతే కాకుండా టాక్ కు తగ్గట్టే థియేటర్లు పెరిగాయి.దీంతో 9వ రోజు రూ. 4.07 కోట్లు వసూలు చేసి పలువురిని ఆశ్చర్యపరిచింది. యుఎస్ బాక్సాఫీస్ వద్ద వన్ మిలియన్ క్రాస్ చేసింది. నిఖిల్ కెరీర్ లో ఇదే ది బెస్ట్ గా చెబుతున్నారు.ఇక 9వ రోజులకు ఇండియా వైడ్ గా హిందీ వెర్షన్ రూ. 15.32 కోట్ల గ్రాస్ ని వసూలు చేయడం రికార్డుగా చెబుతున్నారు. ఇంత వరకు నిఖిల్ నటించిన సినిమాల్లో ఇదే రికార్డుగా చెబుతున్నారు. ఇదిలా వుంటే ఈ మూవీతో దర్శకుడు చందూ మొండేటి రూ. 100 కోట్ల క్లబ్ లో చేరిపోయాడు.అతి తక్కువ రోజుల్లో తన మూవీతో రూ. 100 కోట్ల క్లబ్ లో చేరిన అతి కొద్ది మంది దర్శకుల్లో ఈ ఫీట్ ని సాధించిన దర్శకుడిగా చందూ మొండేటి రికార్డు సాధించాడు. ఈ మూవీ థియేట్రికల్ వసూళ్ల పరంగా 70 ప్లస్ కోట్ల వసూళ్లని రాబట్టి త్వరలో రూ. 100 కోట్ల దిశగా పయనిస్తోంది. నాన్ థియేట్రికల్ వసూళ్ల పరంగా రూ. 30 కోట్లని రాబట్టిన ఈ మూవీ ఈ రెండు వసూళ్లని బట్టి ఇప్పటికే రూ. 100 కోట్ల క్లబ్ లో చేరిపోయింది. ఇంత త్వరగా రూ. 100 కోట్ల మార్కుని చేరిన సినిమాగా రికార్డు సొంతం చేసుకుంది.రానున్న రోజుల్లో ఈ ఫిగర్ మరింతగా పెరిగే అవకాశం వుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కీలక అతిథి పాత్రలో నటించడం శ్రీకృష్ణుడి పై తెరకెక్కిన సినిమా కావడంతో ఈ మూవీకి దక్షిణాదితో పాటు ఉత్తరాది ప్రేక్షకులు కూడా బ్రహ్మరథం పడుతుండటంతో దేశ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ మూవీకి కాసుల వర్షం కురుస్తుండటం విశేషం.

# భారత్-పాక్ మ్యాచ్‌లో విజేత ఎవరు? అఫ్రిది నుంచి ఊహించని ట్విస్ట్




మనం ఎంత కాదన్నా టీమిండియా, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటేనే హైవోల్టేజ్. ఈ చిరకాల ప్రత్యర్థులు ఎక్కడ తలపడ్డా ఉత్కంఠ మాత్రం తారాస్థాయిలో ఉంటుంది. ఎందుకంటే ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే సాధారణ మ్యాచ్‌లా చూడరు.. రెండు దేశాల మధ్య యుద్ధంగానే పరిగణిస్తారు. అలాంటి మ్యాచ్ కోసం కోట్ల మంది జనం వెయ్యి కళ్లతో నిరీక్షిస్తున్నారు. మరి బ్లాక్‌బాస్టర్ మ్యాచ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో గెలుపు మాదంటే మాదే అని ఎవరికి నచ్చిన జోస్యం వాళ్ళు చెప్పుకుంటూ వస్తున్నారు.దుబాయ్‌లోని షేక్ జాయేద్ స్టేడియంలో భారత్-పాకిస్తాన్ మధ్య పోరు ఆదివారం(ఆగస్టు 28) జరగనుంది. గత అక్టోబర్‌లో జరిగిన పొట్టి ప్రపంచకప్‌లో ఇదే వేదికపై పాకిస్తాన్.. భారత్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మరోసారి అదే వేదికలో ఈ రెండు జట్లు ఎదురుపడుతుండడంతో ఆసక్తిగా మారింది. టి20 ప్రపంచకప్‌లో తమకు ఎదురైన ఓటమికి టీమిండియా బదులు తీర్చుకుంటుందా లేక పాకిస్తాన్‌కు మరోసారి దాసోహం అవుతుందా అనేది చూడాలి.ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిదిని ఇద్దరిలో విజేత ఎవరనుకుంటున్నారు అని ప్రశ్నిస్తే.. అతను ఎవరు ఊహించని సమాధానం ఇచ్చాడు. సాధారణంగా భారత్ అభిమాని లేదా మాజీ క్రికెటర్ అయ్యుంటే టీమిండియా అని.. ఒకవేళ పాక్ క్రికెటర్ లేదా అభిమాని అయితే పాకిస్తాన్‌దే గెలుపు అని పేర్కొనడం సహజం. ట్విటర్ వేదికగా షాహిద్ అఫ్రిదిని కొంతమంది అభిమానులు.. "పాకిస్తాన్, భారత్‌లలో ఏ జట్టు బలంగా ఉందని అనుకుంటున్నారు.. ఎవరు మ్యాచ్ గెలుస్తారని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. కచ్చితంగా బాబర్ ఆజం సేన ఫేవరెట్ అని అఫ్రిది పేర్కొంటాడని మనం అనుకుంటాం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**